ACCION FRATERNA
ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం    సెప్టెంబర్ 2011

FOR PRIVATE CIRCULATION ONLY

# వ్యవసాయంలో ఉత్తమ కృషీవలురకు పారితోషికాలు

**మిత్రులారా !**

అనంతపురం జిల్లా రైతు ఏటికి ఎదురీదుతూనే ఉన్నాడు. ఈసారి ఖరీఫ్ కూడా జిల్లా రైతులకు అన్యాయం చేసినట్లే. ప్రకృతి అవరోధాలు, ఆర్థిక అవాంతరాలు రైతుల మనోధైర్యాలను సవాలు చేస్తున్నాయి. సమస్యలలోపుట్టి, సమస్యలలో కొనసాగుతున్న జిల్లా మెట్ట వ్యవసాయాన్ని తనదారికి తెచ్చుకోవడానికి అనంతపురం జిల్లా రైతు నానా విధాలుగా శ్రమిస్తూనే ఉన్నాడు. ఆ రకంగా శ్రమిస్తున్నవారిని, ఆదర్శప్రాయులుగా ఉంటున్న రైతులను, గ్రామ సుస్థిర వ్యవసాయ సమాఖ్యలను, సస్యమిత్ర గ్రూపు కన్వీనర్లను ప్రోత్సహించాలని, వారికి పారితోషిక రూపంలో గుర్తించాలని ఎకాలజీ సెంటరు నిశ్చయించింది. రైతులకు, సుస్థిర వ్యవసాయానికి, సమగ్ర సస్యమిత్ర కార్యకలాపాలకు ఒక సజీవ సంబంధం కొనసాగేటట్లు చేయడమే ఎకాలజీ సెంటరు లక్ష్యంగా పనిచేస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో ఏకైక జీవనాధారంగా ఉంటున్న వ్యవసాయాన్ని మరింతగా రైతు కుటుంబాల ఆదాయవనరుగానూ, వ్యవసాయం మీద ఆధారపడిన కుటుంబాలకు జీవన భద్రత, పౌష్టికాహార లభ్యతతో సగౌరవంగా బతకగలిగే సామాజిక భద్రతలు సుస్థిరం చేయాలనే ఏకైక ఆశయంతో ఎకాలజీ సెంటరు కృషి చేస్తున్నది. ఈ నిరంతర కృషిలో భాగంగానే ఈ ప్రోత్సాహకాలను ఇవ్వాలని ఎకాలజీ సంస్థ భావించింది. ప్రోత్సాహకాలకు అర్హమైన వ్యక్తులను, సంస్థలను గుర్తించి వారిని మరింత బాధ్యతగా పనిచేయాలనే అభిప్రాయాలతోనే ఈ ఆలోచనకు రావడం జరిగింది. ప్రోత్సాహకాలకు ఎంపిక చేయడం ద్వారా మొత్తంగా వ్యవసాయాన్ని పెంపొందించే దిశగా చేస్తున్న ప్రయత్నమే తప్ప వ్యక్తుల స్వలాభాపేక్షకు కాదన్న విషయాన్ని రైతు సోదరులు ముఖ్యంగా గమనించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఎంపిక కాని వారి కృషి తక్కువగా కూడా భావించరాదు. తద్వారా వారు మరింతగా శ్రమిస్తూ మరుసటి సందర్భంలో ప్రోత్సాహకాల్ని, గుర్తింపును పొందగలిగే విధంగా అభివృద్ధి చెందడానికి ఒక అవకాశంగా తీసుకోవాలి. ఎవరెవరికి, ఎంతమందికి, ఏ సంస్థలకు ప్రోత్సాహకాలివ్వాలి ? పారితోషికాలకు అర్హులైన వారిని ఏ విధంగా ఎంపిక చేయాలి? ఎంపిక విధానంలో అనుసరించాల్సిన పద్ధతులను మీ ముందుంచుతున్నాను.

## 1. ఆదర్శ రైతులు

ఆదర్శ రైతులు మండలానికి 5 మంది ఎంపిక కాబడతారు. ఆ విధంగా ఎంపిక అయిన ఒక్కో రైతుకు రూ.3,000/- రూపాయల పారితోషికం ఇవ్వబడుతుంది. పారితోషికం ఒక ప్రోత్సాహకం మాత్రమే. ఈ ఆదర్శ రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నవారై ఉండాలి. తక్కువ పెట్టుబడితో వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకునే మార్గాల్ని వాస్తవ రూపంలో ఆచరించి, వాస్తవ రూపంలో తమ అనుభవాల్ని ఇతర రైతులకు అందిస్తున్న ఈ ఆదర్శ రైతులను ప్రోత్సాహించడమే దీని లక్ష్యం. మేము పని చేస్తున్న అన్ని గ్రామాలలోని రైతులందరూ వీరిని ఆదర్శంగా తీసుకొని ఆదర్శ రైతులుగా మారాలన్నదే మా లక్ష్యం. కేవలం ఒకరిద్దరు లేదా కొద్దిమంది ఆదర్శ రైతులుగా మారినందువల్ల లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాదు.

**ఎటువంటివారు ఆదర్శ రైతులుగా ఎంపిక కాబడతారు ?**

1. సుస్థిర వ్యవసాయ పద్ధతులలో అవగాహన కలిగి వ్యవసాయంలో సాధ్యమైనంత తక్కువ పెట్టుబడులతో వ్యవసాయాన్ని ఆచరిస్తూ ఉండాలి. సేంద్రీయ ఎరువులకు తోడు, జీవామృతము, ఘనజీవామృతము, పురుగుల నియంత్రణకు బీజామృతము కషాయాలను తయారు చేస్తూ పంటలకు ఉపయోగిస్తూ వుండాలి. రైతులను అప్పుల పాలు చేస్తూ, ప్రకృతిని, పంట భూములను నాశనం చేసే రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందులు వాడకుండా ఉండాలి. అన్ని రకాల పంటలలోనూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఉండాలి.
2. సుస్థిర వ్యవసాయ విధానాల ఆచరణలో, రసాయనిక వ్యవసాయం కంటే హెచ్చుగా రైతుకు మిగులు బాటు వుంటుందని నిరూపించగలగాలి. తాను ఆచరించడమేగాకుండా చుట్టుపట్ల రైతులను కూడా ప్రభావితం చేయగలగాలి.
3. సస్యమిత్ర గ్రూపులో ఇతర రైతులకు తాను అవలంబిస్తున్న విధానాల గురించి వివరిస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పిస్తూ ఉండాలి.
4. ఆదర్శ రైతు తనకున్న భూమిలో వ్యాపార పంటలతోపాటుగా ఆహార పంటలు వార్షికాదాయం కొరకు వృక్ష పంటలను పండిస్తూ వుండాలి. గాలి నుంచి వర్షం నుంచి, ఎండల నుంచి పొలాలు దెబ్బ తినకుండా పొలంగట్ల మీద పచ్చి ఆకు పశువుల మేతకు పనికివచ్చే చెట్లను పెంచుతూ వుండాలి. వ్యవసాయ పెట్టుబడులకుగానీ, కుటుంబ పోషణకుగానీ సాధ్యమయినంత వరకూ మార్కెట్టు కొనుగోలు మీద ఆధారపడకుండా స్వయం పోషకత్వాన్ని సాధించడానికి ప్రయత్నాలు చేస్తూ వుండాలి. సస్యమిత్ర గ్రూపులో వీరు సభ్యులుగా ఉండాలి. క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరవుతూ ఉండాలి.

ఆదర్శ రైతుల ఎంపిక గ్రామ సస్యమిత్ర సమాఖ్యలు, మండల సస్యమిత్ర సమాఖ్యలు, ఎకాలజీ సంస్థ సిబ్బంది కలిసి, పరిశీలించి అభిప్రాయాల్ని పంచుకుని ఎంపిక చేస్తారు. ఆదర్శ రైతుగా ఎంపిక కాబడే వ్యక్తి కేవలం తన పొలంలో సుస్థిర వ్యవసాయ పద్ధతులను ఆచరించడమే కాకుండా సుస్థిర వ్యవసాయ విధానాలకు ఎంతమంది రైతులను ప్రభావితం చేయగలిగాడన్నది కీలకమైనదిగా వుంటుంది.

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

## 2. ఆదర్శ సస్యమిత్ర గ్రూపు

మొత్తం ప్రాజెక్టు ఏరియాలో 85 ఆదర్శ సస్యమిత్ర గ్రూపులను ఎంపిక చేయాలని నిర్ణయించడం జరిగింది. ఒక్కో ఆదర్శ సస్యమిత్ర గ్రూపుకు రూ.3,000/- పారితోషకం ఇవ్వాలని కూడా నిర్ణయించడం జరిగింది. ఆదర్శ సస్యమిత్ర గ్రూపు ఎంపికలో ఈ విషయాలు ప్రాధాన్యతగా వుంటాయి. అవి:-

1. ఆదర్శ సస్యమిత్ర గ్రూపు కుటుంబాల మధ్య పరస్పర సహకారాన్ని పాటిస్తూ ఉండాలి. బదులు కూలీలు, వ్యవసాయ పరికరాలు, ఎద్దులు, బండ్లు, బదులు మార్చుకుంటూ ఒకరికొకరు తోడుగా సహాయపడుతుండాలి. ఒకరి కోసం అందరు, అందరి కోసం ఒకరు అనే లక్ష్యంతో బేధభావం రానీయకుండా తోడుగా వుండాలి. తమ గ్రూపులోని లబ్ధిదారులందరూ కార్యక్రమాలను నాణ్యతగా, సక్రమంగా ఉపయోగించుకుంటూ తద్వారా ఏ ఉద్దేశ్యంతో ఆ కార్యక్రమాన్ని అమలు చేసినారో ఆ ఉద్దేశ్యాన్ని నెరవేర్చే విధంగా ఆ లబ్ధిదారులు వినియోగించుకోవలసి వుంటుంది. ఉదాహరణకు తమ గ్రూపులో జీవామృతం తొట్టెలు పొందిన రైతులందరూ ఆ తొట్టెలను జీవామృతం తయారు చేయడానికి వాడుకొనే విధంగా సస్యమిత్ర గ్రూపు చూడవలసి వుంటుంది.
2. సస్యమిత్ర గ్రూపులు ఖచ్చితంగా నెలకొకసారి సమావేశాలు నిర్వహిస్తూ వుండాలి. సమావేశంలో గ్రూపు రైతు సభ్యులందరూ పాల్గొంటూ వుండాలి. సమావేశంలో జరిగే చర్చలలో సభ్యులందరూ ఉత్సాహంగా పాల్గొంటూ వుండాలి. ఉత్సాహం, ఆసక్తి చూపని సభ్యులను సమావేశంలో ఉత్సాహంగా పాల్గొనే విధంగా సస్యమిత్ర గ్రూపులు ప్రయత్నిస్తూ వుండాలి. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఖచ్చితంగా అమలు జరిగే విధంగా గ్రూపులు ప్రయత్నిస్తూ వుండాలి. పథకాల అమలులో అర్హులైన, యోగ్యులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తూ వుండాలి. పథకాల అమలులో పూర్తిగా పారదర్శకతను పాటిస్తూ వుండాలి. సభ్యులలో జవాబుదారీతనాన్ని పెంపొందించాలి.
3. సస్యమిత్ర గ్రూపులకు సంబంధించిన మినిట్స్ ఇతర రికార్డులు, గ్రూపుల ద్వారా జరిగే చెల్లింపులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ వుండాలి. వాటిని సమీక్షిస్తూ వుండాలి. ప్రతి ఒక సభ్యునికి గ్రూపు కార్యకలాపాలు, నిర్ణయాలు, అమలును గురించిన అవగాహన కలిగించాలి. అమలుపర్చిన కార్యక్రమాలను సమావేశాల్లో వివరించి వాటిని ఆమోదింపజేసుకుంటూ ఉండాలి.

గ్రామ సస్యమిత్ర సమాఖ్యలు, మండల సస్యమిత్ర సమాఖ్యలు ఎకాలజీ సంస్థ సిబ్బంది కలిసి విధివిధానాలను రూపొందించుకుని ఎంపిక చేస్తారు.

## 3. ఉత్తమ గ్రామ సస్యమిత్ర సమాఖ్యలు

మండలానికి మూడు గ్రామ సస్యమిత్ర సమాఖ్యలను ఉత్తమ గ్రామ సస్యమిత్ర సమాఖ్యలుగా ఎంపిక చేయాలని నిర్ణయించడం జరిగింది. ఒక్కో గ్రామ సమాఖ్యకు అయిదు వేలు పారితోషికంగా ఇవ్వాలని కూడా నిర్ణయించడం జరిగింది.

1. ఉత్తమ గ్రామ సస్యమిత్ర సమాఖ్య కనీసంగా నెలకొకసారి ఖచ్చితంగా సమావేశాలు నిర్వహిస్తూ ఉండాలి. అవసరంమేరకు ఎన్ని సమావేశాలనైనా జరుపుకోవచ్చును. గ్రామ సస్యమిత్ర సమాఖ్య సస్యమిత్ర గ్రూపుల అభిప్రాయాలకు విలువనిస్తూ, ప్రజాస్వామ్యయుతంగా చర్చలు జరుపుతుండాలి. సమావేశాలు మొక్కుబడిగా జరగడంవల్ల సమయనష్టం తప్పితే, ఎవరికీ ఎలాంటి ఉపయోగం ఉండదు. జరిగిన ప్రతి సమావేశంలోనూ జరిగిన చర్చలు, నిర్ణయాలు ఉపయోగకరంగా ఉండాలి.
2. తమ గ్రామానికి కేటాయించిన కార్యక్రమాలన్నింటిని సక్రమంగా నాణ్యతగా పారదర్శకంగా అమలు జరుపుతుండాలి. కార్యక్రమాల అమలులో గ్రామ సమాఖ్య ముఖ్యపాత్ర పోషిస్తూ ఉండాలి. అంతేగాకుండా లబ్ధిదారులందరూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను ఆశించిన విధంగా ఆచరిస్తూ ఉండాలి. ఉదాహరణకు జీవామృతం తొట్టెలు తీసుకొన్న రైతులు, ఆ తొట్టెలను జీవామృతం తయారు చేయడానికి ఉపయోగిస్తూ వారు జీవామృతాన్ని పంటకు ఉపయోగిస్తూ ఉండాలి. వాటి అవులు కొన్న రైతులు, ఆ ఆవుపేడ, గంజునుపయోగించి జీవామృతం తయారు చేసి తమ పంటలకు ఉపయోగిస్తూ ఉండాలి, లేదా ఇతరులకు అమ్ముతూ వుండాలి. ఈ విధంగా కార్యక్రమాల ఉద్దేశ్యాలను లబ్ధిదారులందరూ నెరవేరుస్తూ ఉండాలి. సస్యమిత్ర గ్రూపుల ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా పారదర్శకంగా ఉండాలి.
3. సస్యమిత్ర గ్రూపులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను పరిశీలించి చర్చలు జరిపి ఆమోదింప చేయాలి. గ్రామ సస్యమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే పనులలో పారదర్శకత, నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటిస్తూ ఉండాలి. సస్యమిత్ర గ్రూపులు, గ్రామ సస్యమిత్ర సమాఖ్యల రికార్డులు, మినిట్స్ సక్రమంగా ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఉండాలి. లబ్ధిదారులకు చెల్లింపులు జరిగే సందర్భంలో పూర్తిగా పారదర్శకతను పాటించాలి.
4. గ్రామ స్థాయిలో ఉన్న విత్తన బ్యాంకులు సమర్థవంతంగా నడుపుతూ ఉండాలి. ప్రతి మండల సస్యమిత్ర సమాఖ్య సమావేశానికి తప్పని సరిగా కన్వీనరు, కో-కన్వీనర్లు హాజరవుతూ వుండాలి. ప్రతి సమావేశంలోనూ గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను గురించి సమీక్షించుకోవాలి. గ్రామంలో సస్యమిత్ర గ్రూపుల్లో చేరకుండా ఉండిన రైతులను ప్రభావితపర్చి వారిని సుస్థిర వ్యవసాయ పద్ధతులు ఆచరించే విధంగా కృషి చేయాలి. గ్రామంలో అమలు జరిపిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగానూ, నాణ్యతగానూ ఉండే విధంగా చర్యలు తీసుకుని గ్రామంలో సేంద్రీయ వ్యవసాయం పట్ల ఆసక్తి కలిగే విధంగా రైతులను సమాధానపరుస్తూ వివరిస్తూ ఉండాలి.

## 4. ఉత్తమ కార్యకర్త

మండలానికి ముగ్గురు కార్యకర్తలను ఎంపిక చేయాలని నిర్ణయించడం జరిగింది. ఒక్కో కార్యకర్తకు మూడు వేల రూపాయలు ప్రోత్సాహకం ఇవ్వాలని కూడా నిర్ణయించడం జరిగింది. వాస్తవానికి కార్యకర్త పాత్ర చాలా బాధ్యతతో కూడుకున్నట్టిది.

1. గ్రామ కార్యకర్త సస్యమిత్ర సమాఖ్యకు, సిబ్బందికి అనుసంధానంగా పనిచేస్తాడు. గ్రామ కార్యకర్త సస్యమిత్ర గ్రూపుల, గ్రామ సమాఖ్యల సమావేశాలు నిర్వహించడంలోనూ గ్రామ స్థాయిలో కార్యక్రమాల అమలులోనూ చురుకైన పాత్ర పోషిస్తాడు. తమ గ్రామానికి కేటాయించిన కార్యక్రమాలన్నింటిని సక్రమంగా నాణ్యతగా అమలు చేయడంలోనూ, సస్యమిత్ర గ్రూపులను, గ్రామ సమాఖ్యలను ఉత్తేజ పరిచి, ప్రోత్సహించి వారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగునట్లు సమన్వయం చేస్తూ వుండవలయును.
2. లబ్ధిదారులు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొనే విధంగా గ్రామ సమాఖ్యలను ప్రోత్సహిస్తూ, బలోపేతం చేస్తూవుండాలి. సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు మినిట్స్ పుస్తకంలో నమోదు చేయాలి. మినిట్స్ పుస్తకంతోపాటు, పొలంబడి రిజిష్టరు, లబ్ధిదారుల రిజిష్టరు, క్యాష్‌బుక్, లెడ్జరు, శిక్షణ సమావేశాల నిర్వహణ రికార్డు,

చెల్లింపుల రిజిష్టరు, మితకర్బన వ్యవసాయ రైతుల దినచర్య నమోదు పర్యవేక్షణ, రైతుల ఇతర ప్రధాన కార్యక్రమాల దిన చర్యల నమోదు, తదితర విషయాలను క్రమం తప్పకుండా, ఎప్పటికప్పుడు విజిటర్స్ చూడడానికి సిద్ధంగా ఉంచగలగాలి.

3. కార్యకర్త ప్రాజెక్టు కార్యక్రమాలలో సస్యమిత్ర సమాఖ్యలతో కలిసి పనిచేస్తూ వుండాలి. మండల స్థాయి సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఆ సమావేశ విషయాలను ఎప్పటికప్పుడు గ్రామ స్థాయిలో సభ్యులకు తెలియజేస్తూ ఉండాలి. ఎకాలజీ సంస్థ సిబ్బందితో పరస్పర అవగాహన కలిగి వుండాలి. ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న కార్యకర్తలను గుర్తించి ఉత్తమ కార్యకర్తలుగా ఎంపిక చేయడం జరుగుతుంది.

## 5. ఉత్తమ సస్యమిత్ర గ్రూపు కన్వీనరు

గ్రామ స్థాయిలో వుండే సస్యమిత్ర గ్రూపులకు సంబంధించిన కన్వీనర్లను ఉత్తమ సస్యమిత్ర గ్రూపు కన్వీనర్లుగా ఎంపిక చేయడం జరుగుతుంది. ఆ రకంగా ఒక్కో మండలానికి ముగ్గురు కన్వీనర్లను ఎంపిక చేస్తారు. ఎంపికయిన ఒక్కో కన్వీనరుకు రూ.3,000/- పారితోషికంగా ఇవ్వడం జరుగుతుంది.

1. సస్యమిత్ర గ్రూపులకు సంబంధించిన సభ్యులను ఉత్తేజపరుస్తూ సేంద్రీయ విధానంలో రైతులకు ఆసక్తి కల్పించడంలోనూ, కషాయాల ద్వారా జీవనియంత్రణ పద్ధతుల ద్వారా పంటల్ని కాపాడుకోవడం, ప్రకృతికి అనుకూలంగా రైతులు వ్యవసాయ పద్ధతులను ఆచరించడంలో విశేష శ్రద్ధ చొరవ కనపర్చిన గ్రూపు కన్వీనర్లను ఇందుకు ఎంపిక చేస్తారు.
2. గ్రామ సస్యమిత్ర సమాఖ్యలో నిర్మాణాత్మకంగా నాయకత్వ పాత్ర పోషిస్తూ, సంస్థ కార్యక్రమాల ద్వారా తన గ్రూపులోని కుటుంబాలకు లబ్ధిచేకూరే విధంగా పని చేస్తూ వుండాలి. ఆ విధంగా లబ్ధి పొందిన కుటుంబాలు ఆ కార్యక్రమాలు సక్రమంగా సద్వినియోగం చేసుకొనే విధంగా పర్యవేక్షిస్తూ, ప్రోత్సహిస్తూ ఉండాలి.
3. గ్రూపుకు సంబంధించిన రైతులందరూ ఒకే అభిప్రాయంతో రసాయనిక ఎరువులు, పురుగు మందులకు బదులుగా ఇతర పద్ధతులను అభివృద్ధి చేసుకోవడంలోనూ, నూతన విషయాలను కనుగొనడానికి రైతులను ప్రోత్సాహిస్తుండాలి.

## ముగింపు

ఈ మా ప్రయత్నాలన్నీ కూడా రసాయనిక వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా, రైతుకు నష్టం లేకుండా తక్కువ ఖర్చుతో వ్యవసాయం కొనసాగించే వాతావరణ ఏర్పాటు చేయాలన్నదే మా తపన. మారిన వాతావరణ పరిస్థితులలో మారుతున్న రుతుధర్మాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని రక్షించుకోవడం మనముందున్న ప్రధాన సమస్య. ఈ ప్రయత్నంలో రైతులను, కన్వీనర్లను, కార్యకర్తలను మరింతగా ప్రోత్సాహించడానికే మేము ప్రవేశ పెట్టినవి ఈ ప్రోత్సాహకాలు. ఈ బృహత్ ప్రయత్నంలో మీరు, సిబ్బంది, అందరం కలిసి వ్యవసాయాన్ని, ప్రకృతిని బాగుచేసుకుందాం. ఈ ప్రయత్నంలో మీ అందరి సహకారం ఎప్పటిలాగే ఉంటుందని ఆశిస్తూ వున్నాను.

మీ

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు.**

# ఆముదం సాగులో సస్యరక్షణ

ఆముదం పంటను ముఖ్యంగా దాసరి పురుగు, లద్దె పురుగు, కాయతొలుచు పురుగు మరియు గొంగళి పురుగులు ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. దాసరి పురుగు జులై నుండీ అక్టోబర్ వరకూ ఆకులపై రంధ్రాలు ఏర్పరచి తినడంవలన కాడలు, ఈనెలు మాత్రమే మిగులుతాయి. ఈ పురుగు లేత గెలలను కూడా ఆశిస్తుంది. లద్దెపురుగులు ప్రారంభ దశలో ఆకుల అడుగుభాగంలో గుంపులుగా చేరి పత్రహరితాన్ని గీకి తినడంవల్ల ఆకులు జల్లెడలాగా మారుతాయి. ఎదిగిన లద్దెపురుగులు సెప్టెంబరు మాసం వరకు గెలలపై కూడా కనిపిస్తాయి.

ఆముదం పంట వేసిన 20-60 రోజుల వరకు ఎండు తెగులు వస్తుంది. మొక్క తొలి దశలో సోకిన ఎడల ఆకులు వడలి మొక్క ఎండిపోతుంది. ఎదిగిన మొక్కలలో గెల రాలిపోతుంది.

బూజు తెగులు ఆముదంలో అత్యంత ప్రధానమైన సమస్య. గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, రాత్రి ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా ఉన్నప్పుడు, తుఫాన్ ప్రభావిత వర్షాలు పడుతున్నపుడు ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. కాయల మీద బూడిద రంగు శిలీంద్రం కనిపించి, ఈ శిలీంద్ర బీజాలు గాలి ద్వారా ఒక మొక్క నుంచి మరో మొక్కకు వ్యాపిస్తాయి.

### నివారణ :-

1. విత్తనం మొలకెత్తిన నెల తర్వాత దాసరి పురుగుల తల్లి పురుగులు పంట మీద ఎక్కువ గ్రుడ్లు పెట్టకుండా 5 శాతం వేప లేదా వావిలాకు కషాయం పిచికారీ చేయాలి.
2. పంట 30-60 రోజుల వయస్సులో దాసరి పురుగు ఆశిస్తుంది. ఆకు అడుగుభాగంలో విడివిడిగా పెట్టిన ఆకు పచ్చని గ్రుడ్లను గమనించిన వెంటనే ట్రైకోగ్రామ పరాన్నజీవి అట్టలను ఎకరానికి ఒకటి లేదా రెండింటిని ముక్కలుగా కత్తిరించి పొలంలో అక్కడక్కడ ఆకులకు కట్టాలి.
3. దాసరి పురుగు మీద ఆగష్టు మాసం నుండి అద్దశీల (మైక్రోప్లైటిస్) అనే పరాన్నజీవి ఎక్కువగా ఆశిస్తుంది. దాసరి పురుగును తిని మనకు మేలు చేసే ఈ మిత్ర పురుగులను సులువుగా గుర్తించవచ్చు. దాసరి పురుగు శరీరం అడుగున చివర భాగంలో గోధుమ గింజ లాంటి గూడు అంటి ఉన్న ఎడల అది ఈ పరాన్నజీవి ఆశించినదిగా గుర్తించాలి. పొలంలో 50 శాతం కంటే ఎక్కువ దాసరి పురుగులకు అద్దశీల గమనించిన ఎడల, నివారణకు ఎటువంటి మందు పిచికారీ చేయవలసిన అవసరం లేదు.
4. ఎకరానికి 2-3 లింగాకర్షక బుట్టలను అమర్చిన ఎడల లద్దెపురుగు రాకను ముందుగా గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చు.
5. దాసరి పురుగు ఎదిగిన పెద్ద దాసరి పురుగులు పొలంలో ఎక్కువగా ఉంటే ఒకసారి పచ్చిమిర్చి+వెల్లుల్లి ద్రావణం పిచికారీ చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చు.
6. రెండోసారి కలుపు తీసిన తరువాత పురుగులను తినే పక్షులను ఆకర్షించడానికి వీలుగా ఎకరాకు 10 పక్షి స్థావరాలను అమర్చుకోవాలి.
7. లద్దె పురుగు సోకిన ఆకుల అడుగుభాగంలో, పురుగులు తొలిదశలో గుంపులుగా వుంటాయి. అవి పత్రహరితాన్ని గీరి తినడంవల్ల ఏర్పడిన జల్లెడ ఆకులను దూరం నుంచి సులువుగా గుర్తించవచ్చు. అటువంటి పురుగులను ఆకులతో సహా ఏరి నాశనం చేయాలి.

**(తొలకరి, సెప్టెంబర్ 2011 నుండి)**

# సుస్థిర వ్యవసాయ పద్ధతులలో...

## దానిమ్మ పంటలో సస్యరక్షణ

హస్త బహార్‌కు (సెప్టెంబర్ – అక్టోబర్ మాసాల్లో వచ్చే పూత కోసం) చెట్లకు జూన్ నెల నుండే నీటి తడులివ్వడం నిలిపివేయాలి. సెప్టెంబర్‌కు చెట్లు బెట్టకు రాగానే కొమ్మలు కత్తిరించి ఎరువుల్ని వేసి నీరు పెట్టాలి. అక్టోబర్‌లో పూత వచ్చి ఆ పూత తాలూకు కాయలు ఫిబ్రవరి – మార్చిలో కోతకు సిద్ధమౌతాయి. వీటికి బ్యాక్టీరియా మచ్చ, మాడు తెగులు అంతగా ఆశించదు, కాయలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. మన రాష్ట్రంలో రైతులు చాలామటుకు ఈ సీజన్ పంట తీయడానికి మొగ్గుచూపుతున్నారు.

**పూత, పిందె తీసివేయడం :** దానిమ్మలో తగిన నాణ్యత, కాయ సైజు పెంచడానికి తప్పనిసరిగా పూత, కాయలను పలుచన చేయాలి. దీనివల్ల కాయ సైజు పెరగడమే కాకుండా చీడపీడల సమస్య కూడా తగ్గుతుంది. 6 సంవత్సరాల వరకు చెట్టుకు 30–50 కాయలు, ఆపై వయసుగల చెట్లకు 60 కాయల వరకు ఉంచవచ్చు.

**కాయ పగుళ్ళు - నివారణ :** దానిమ్మలో కాయపగుళ్ళు సాధారణంగా ఉష్ణోగ్రతల్లో తేడాలు, క్రమపద్ధతిలో నీటి తడులివ్వకపోవడం, గాలిలో తేమశాతం మొదలైన కారణాలవల్ల వస్తాయి. జూన్ – జూలై పూత వచ్చే మ్రిగ్‌బహార్ పంట వర్షాకాలంలో ఉష్ణోగ్రతలు, తేమలో తేడాలవల్ల కాయ పగుళ్ళు వచ్చే అవకాశం ఎక్కువ. అటువంటి పరిస్థితులలో కాయలోని కణజాలం ఎదుగుదల, తొక్క కణజాలం ఎదుగుదలకంటే ఎక్కువై చర్మంపై ఒత్తిడి కలిగిస్తుంది. కానీ క్రమ పద్ధతిలో నీటి తడులివ్వడం వల్ల కాయపగుళ్ళను అరికట్టవచ్చు. లేత తోటల్లో అయితే ఈ కాయపగుళ్ళు ఎక్కువగా బోరాన్ ధాతులోపంవల్ల ఏర్పడతాయి. చెట్టుకు తగిన మోతాదులో ఎరువులు వేయకపోవడంవల్ల, నత్రజని మోతాదు ఎక్కువైనా కూడా పగుళ్ళు ఏర్పడే అవకాశం ఉంది.

**కాయతొలిచే పురుగు :** ఇది దానిమ్మ పండ్లనే కాక జామ, వెలగ, చింతపండ్లను కూడా ఆశించి నష్టపరుస్తుంది. ఒక్కొక్క సమయంలో దానిమ్మలో ఈ పురుగువల్ల నష్టం 50 శాతం వరకూ ఉంటుంది. ఆడ సీతాకోక చిలుక ఒక్కొక్క గుడ్డును పువ్వులేదా కాయ మీద పెడుతుంది. గొంగళిపురుగులు కాయను తొలిచి తొక్కమీదనే ఉన్న గుజ్జు మరియు గింజలను తింటాయి. ముదురు గోధుమరంగుగల గొంగళిపురుగు మీద తెల్లని మచ్చలతో అక్కడక్కడా పుట్టువెంట్రుకలు కలిగి వుంటాయి. ఇవి చేసిన రంధ్రం ద్వారా బ్యాక్టీరియా, బూజు తెగుళ్ళు వ్యాపించి కాయ కుళ్ళి రాలిపోతుంది. చిన్న తోటలలో కాయలకు బుట్టలు కట్టడం వల్ల గ్రుడ్లు పెట్టడాన్ని నివారించవచ్చు.

**నివారణ :** పూత ఏర్పడే దశలో పశువుల పేడ + మూత్రం ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో పంటపై పిచికారి చేయడం ద్వారా రెక్కల పురుగు గ్రుడ్లు పెట్టడాన్ని కొంత వరకు నివారించవచ్చు.

చిన్న కాయల దశలో 5 శాతం వేప కషాయాన్ని పిచికారి చేయాలి. పంట దశలో కనీసం 2–3 సార్లు పిచికారి చేయటం చాలా అవసరం.

**దాసరి పురుగు లేదా నామాల పురుగు :** ఆముదం పంటను ఎక్కువగా ఆశించే ఈ పురుగు దానిమ్మ పంటకు కూడా చాలా నష్టం కలిగిస్తుంది. దీని లార్వాలు గోధుమ లేక ఊదా రంగులో వుండి ఇరుప్రక్కలా ఎర్రటి లేదా గోధుమరంగు చారలతో వుంటాయి. లార్వాలు ఆకులను తింటాయి. తీవ్ర స్థాయిలో ఆశించి ఆకులన్నింటినీ తిని చిన్న మొక్కలను బోడిగా చేస్తాయి. రెక్కల పురుగులు కాయల నుండి రసం పీల్చడంవల్ల రంధ్రం నుండి రసం కారుతుంది.

**తామర పురుగు :** దానిమ్మ పంటను అప్పుడప్పుడూ తామరపురుగులు ఆశించి నష్టాన్ని కలుగచేస్తాయి. పెద్ద తామర పురుగులు చాలా చిన్నవిగా సున్నితంగా చీలిన రెక్కలతో వుంటాయి. పిల్ల పురుగులు, పెద్ద పురుగులు ఆకులను, పూలను, పిందెలను మరియు కాయలను గోకి రసాన్ని పీలుస్తాయి. ఆశించిన ఆకు చివర్లు ముడుచుకుపోయి ఎండిపోతాయి. పువ్వులు, పిందెలు రాలిపోతాయి. కాయపై తామర లేక సార లాగ ఏర్పడి పండ్లకు మార్కెట్‌లో ధర పలకదు.

**నివారణ :**

- పొలంలో తెలుపు రంగు పూసిన జిగురు డబ్బాలను ఎకరాకు 10–12 వరకు అమర్చాలి.
- పొలంలో కలుపు ముఖ్యంగా 'వయ్యారిభామ' లేకుండా పొలాన్ని శుభ్రం చేయాలి.
- పురుగు ఆశించే సమయంలో పంటపై 5 శాతం వేప కషాయం లేదా ఒక శాతం వేపనూనె ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చెయ్యాలి.

**పిండినల్లి :** ఇది దానిమ్మనే కాక మామిడి, సీతాఫలం, రేగు మరియు ఇతర పండ్లతోటలను కూడా ఆశించి నష్టం కలిగిస్తుంది. తల్లి పురుగులు అండాకారంలో శరీరమంతా తెల్లటి దూదివంటి పదార్థంతో కప్పబడి వుంటాయి. లేత పసుపుపచ్చ పిల్ల పురుగులు పెరిగే కొలది దూదివంటి పదార్థంతో కప్పబడుతాయి. ఇవి ఆకులను, లేత కొమ్మలను, కాయల తొడిమలను మరియు వేర్ల నుండి రసం పీలుస్తాయి. ఆశించిన ఆకులు తెల్లబడి రాలిపోతాయి. చెట్లు వాడిపోయి తక్కువ దిగుబడి, నాసిరకం పండ్లనిస్తాయి. పిండినల్లి ఆశించిన వేర్లు మెత్తబడతాయి. ఇవి తేనెలాంటి జిగురుపదార్థాన్ని విసర్జిస్తాయి. దానిపై మసితెగులు వృద్ధి చెందుతుంది.

చెట్ల కింద, పాదులోని మట్టిని త్రవ్వటం, ఆశించిన కొమ్మలను కత్తిరించి నాశనం చేయటంవల్ల పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.

పంటపై ఒక శాతం వేప నూనె పిచికారి చేయాలి.

మొక్కల చుట్టూ 1–2 కిలోల వేపపిండిని వేసి భూమిలో వేసి బాగా కలపాలి.

### దానిమ్మలో తెగుళ్ళు

**సెర్కొస్పోరా ఆకుమచ్చ తెగులు :** ఈ తెగులు సెప్టెంబరు నుండి నవంబరు వరకు అధికంగా వస్తుంది. ఆకులపై చిన్న గోధుమరంగు మచ్చలేర్పడుతాయి. క్రమేపీ ఇవి పెరిగి గుండ్రని లేక క్రమాకృతి లేని ముదురు గోధుమ రంగు మచ్చలుగా మారతాయి. ఆకుల అడుగు భాగాన మచ్చలు అణగారి ఉండి శిలీంధ్ర బీజ సముదాయాలు కలిగి బూడిద రంగులో ఉంటాయి. చిన్న గుండ్రని నల్లటి మచ్చలు పూవులపై, కాయలపై కూడా ఏర్పడతాయి. క్రమాకృతి లేని అణగారిన పెద్ద మచ్చలు ఏర్పడటంవలన కాయలు నాణ్యతను కోల్పోయి వికారంగా ఉంటాయి.

**యాంత్రక్నోస్ మచ్చ తెగులు :** ఆగష్టు నుండి సెప్టెంబరు వరకు గాలిలో తేమ అధికంగా వుంటే ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఆకులపై చిన్న క్రమాకృతి కలిగిన లేదా ఒక ఆకారం లేని పేలవమైన ఊదారంగు లేక నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చల చుట్టూ పసుపురంగు అంచులు వుంటాయి. తెగులు సోకిన ఆకులు పసుపురంగుకు మారి రాలిపోతాయి. కాయపై మొదట బొడ్డువద్ద మచ్చలేర్పడి తదుపరి ఈ మచ్చలు కాయంతా వ్యాపిస్తాయి. తోటలో తెగులు గాలిలో ఉండే శిలీంధ్ర బీజాల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

### తెగుళ్ళ నివారణ

- పంటపై మూడు వారాలకొకసారి జీవామృతం పిచికారి చేయాలి. లేదా
- పశువుల పేడ + ఇంగువ + మూత్రం – ద్రావణాన్ని కనీసం రెండు సార్లు, 15 రోజుల వ్యవధిలో పంటపై పిచికారి చేయాలి. లేదా
- పుల్ల మజ్జిగ ద్రావణాన్ని (6 లీటర్లు – 100 లీటర్ల నీటిలో) రెండు సార్లు, 15 రోజుల వ్యవధిలో పంటపై పిచికారి చేయాలి.

(తొలకరి, సెప్టెంబర్ 2011 నుండి)

ప్రచురణ: డైరెక్టరు – ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం – 515 002.
☎ (08554) – 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) – 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in